రాయితీపై ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు

దరఖాస్తులు ఆహ్వానిస్తున్న జిల్లా అధికార యంత్రాంగం



తెలంగాణ రాష్ట్ర ఆహార శుద్ధి సంస్థ ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ అనుమతితో మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ప్రధాన మంత్రి ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్ (పీఎంఎఫ్ఎంఈ) సీఐలో భాగంగా 35 శాతం రుణ రాయితీతో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు రుణాల మంజూరు కోసం దరఖాస్తులను అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి ఆహ్వానిస్తున్నట్లు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్, జిల్లా నోడల్ అధికారి ప్రశాంత్‌కుమార్ వెల్లడించారు.

– సాక్షి, సిటీబ్యూరో

◆ మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని రైతులు, మహిళలు, నిరుద్యోగ యువత, స్వయం సహాయ సంఘాల సభ్యులు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, సూక్ష్మ ఆహార పరిశ్రమలు, స్వచ్ఛంద సంస్థలు, గ్రామీణ యువతసహా ఎవరైనా ఫుడ్ ప్రాసెసింగ్‌లో ఆసక్తి కలిగిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

◆ అభ్యర్థులు తమ దరఖాస్తును పూర్తి వివరాలతో ఆధార్, పాన్ కార్డు, బ్యాంకు పాస్ పుస్తకం, విద్యుత్ బిల్లు, యూనిట్‌కు సంబంధించిన వివరాలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

జిల్లా ఆహార శుద్ధి పరిశ్రమల డీఆర్‌పీఈ అమర్ సింగ్‌ను ఫోన్: 94934 38347లో సంప్రదించాలి.

అర్హతలు ఇవే...

దరఖాస్తుదారుల వయస్సు 18 నుంచి 55 సంవత్సరాల మధ్య ఉండాలని జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్, జిల్లా నోడల్ అధికారి ప్రశాంత్‌కుమార్ తెలిపారు. దరఖాస్తుదారులు గతంలో ఏదైనా ప్రభుత్వ పథకం నుంచి రాయితీ పొంది ఉండకూడదన్నారు. ప్రాజెక్ట్ వ్యయంలో 35 శాతం వరకు రుణ అనుసంధాన రాయితీ (గరిష్ఠ రాయితీ పరిమితి రూ. 10 లక్షలు) ఉంటుందన్నారు. లబ్ధిదారుల వాటా కనీసం 10 శాతం ఉండాలని, మిగిలినది బ్యాంక్ నుంచి రుణం ఇస్తారని వివరించారు.

జిల్లా స్థాయి 'యువజన' ఉత్సవాలు

సాక్షి, సిటీబ్యూరో: యువతలో దాగి ఉన్న ప్రతిభను గుర్తించేందుకు తెలంగాణ ప్రభుత్వం యువజన సంబురాలకు శ్రీకారం చుట్టిందని జిల్లా యువజన, క్రీడల అధికారి జి.వి.గోపాల్‌రావు తెలిపారు. చదువుతో పాటు కళలు, కళా ప్రదర్శనలు, ఆటల్లో యువతకు ఈ నెల 27న మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయం అవరణంలో పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ పోటీలకు 15 నుంచి 29 సంవత్సరాల లోపు వయసు వారు మాత్రమే అర్హులని తెలిపారు. ఆసక్తి కలిగిన యువతీయువకులు ఈ నెల 26వ తేదీలోగా కలెక్టరేట్ రెండో అంతస్తులోని జిల్లా యువజన క్రీడల కార్యాలయంలో వ్యక్తిగతంగా కలవచ్చన్నారు. వాట్సాప్ నంబర్: 76609 19518లో కూడా వివరాలతో కూడిన పేర్లను నమోదు చేసుకోవచ్చని వివరించారు.

◆ ప్రథమ స్థానంలో నిలిచిన వారిని రాష్ట్ర స్థాయికి ఎంపిక చేస్తామన్నారు. రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానంలో నిలిచిన విజేతలను వచ్చే ఏడాది జనవరి 12 నుంచి 16 వరకు జాతీయ స్థాయిలో జరిగే వేడుకలకు పంపిస్తామని పేర్కొన్నారు. అభ్యర్థులు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా వాస్తవ్యులై ఉండాలని, ఆధార్ కార్డ్, 2 పాస్ ఫొటోలు తప్పని సరిగా ఉండాలన్నారు.

పోటీలు ఇవే...

1) జానపద నృత్య బృందం (సభ్యుల సంఖ్య 10కి మించ రాదు. ప్రదర్శనకు గరిష్ఠ కాలపరిమితి 15 నిమిషాలు).
2) జానపద పాటల బృందం (సభ్యుల సంఖ్య 10 మందికి మించరాదు. ప్రదర్శనకు గరిష్ఠ కాలపరిమితి 7 నిమిషాలు)
3) జానపద నృత్యం(వ్యక్తిగతం) (ఈ బృందంలో ఐదుగురికి మించరాదు. ప్రదర్శనకు గరిష్ఠ కాలపరిమితి 7 నిమిషాలు).
4) జానపద పాటలు (వ్యక్తిగతం) (అయిదుగురు సభ్యులకు మించరాదు. ప్రదర్శనకు గరిష్ఠ కాలపరిమితి 7 నిమిషాలు). నోట్: సినిమా పాటలు అనుమతించరు. వాయిద్య పరికరాలు అభ్యర్థులే తెచ్చుకోవాలి.
5) కవిత్వం (హిందీ/ఇంగ్లిష్) (మొత్తం 500 పదాలతో గంటలో (60 నిమిషాలు) పూర్తి చేయాలి)
6) వ్యాస రచన(హిందీ/ఇంగ్లిష్) (ఇందులో 1,000 పదాలతో 60 నిమిషాల్లో పూర్తి చేయాలి)
7) పెయింటింగ్ పెయింటింగ్ (ఏ3 సైజులో 90 నిమిషాల వ్యవధిలో పూర్తి చేయాలి. చిత్రలేఖనానికి సంబంధించిన శీర్షిక 20–30 పదాలు మించకూడదు. పెయింటింగ్ సామగ్రిని ఎవరికి వారే తెచ్చుకోవాలి)
8) ఉపన్యాసం(హిందీ/ఇంగ్లిష్) (ఎంపిక చేసిన అంశంపై హిందీ లేదా ఇంగ్లిష్ 3 నిమిషాలు మించకుండా మాట్లాడాలి)
9) యువతి (హస్తకళలు, వస్త్రాలు, వ్యవసాయ ఉత్పత్తి) (హస్తకళలు, వస్త్రాలు, వ్యవసాయ ఉత్పత్తి కేటగిరీల్లో తయారు చేసిన ఉత్పత్తులను ప్రదర్శనకు తీసుకురావాలి) ఇందులో ఎంపిక చేసిన వారు రాష్ట్ర స్థాయికి అర్హత సాధిస్తారు.

ప్రజా సమస్యలపై సత్వరమే స్పందించాలి



అవంతినగర్‌తోటలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, తదితరులు

మోతీనగర్: ప్రజా సమస్యలపై అధికారులు సత్వరమే స్పందించాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పేర్కొన్నారు. మూసాపేట డివిజన్‌లోని అవంతినగర్‌తోటలో అధికారులతో కలిసి సోమవారం పర్యటించారు. కాలనీలో తాగునీటి సమస్య ఎదురవుతుందని అదేవిధంగా డ్రైనేజీ, రోడ్ల సమస్యలు ఉన్నాయని ప్రజలు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఎమ్మెల్యే స్పందిస్తూ కాలనీ వాసులకు సరిపడా తాగునీరు సరఫరా చేయాలని వాటర్‌వర్క్స్ అధికారులకు, అలాగే డ్రైనేజీ, రోడ్లకు మరమ్మతులు త్వరగా చేపట్టి పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ సత్యనారాయణ, అంబటి శ్రీనివాస్, సత్యం, తిరుపతి, నరసింహారెడ్డి, వెంకటేశ్వర్లు, సుశీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జోనల్ కార్యాలయంలో బేబీ ఫీడింగ్ రూమ్ ప్రారంభం



బేబీ ఫీడింగ్ రూమ్‌ను ప్రారంభించిన జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి జోన్ కార్యాలయంలో జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్ ప్రత్యేక బేబీ ఫీడింగ్ రూమ్‌ను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బేబీ ఫీడింగ్ రూమ్ తల్లులు, వారి పిల్లలకు ఆహారం, సంరక్షణకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. తల్లులు, శిశువులకు సౌకర్యంగా ఉండేలా సీటింగ్, సౌకర్యాలు ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ ఫీడింగ్ రూమ్ ఏర్పాటుతో కూకట్‌పల్లి జోన్ మహిళా ఉద్యోగులు సంతోషాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో శ్రీదేవి, శ్రీకాంతరెడ్డి, రంజిత్, మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

పోషకాహారంపై అవగాహన

రంగారెడ్డినగర్: రంగారెడ్డినగర్ డివిజన్ పరిధి రంగారెడ్డినగర్ అంగన్‌వాడీ కేంద్రంలో పోషక మాసాన్ని పురస్కరించుకుని గర్భిణులు, బాలింతలకు సోమవారం పోషకాహారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గర్భిణులకు సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసనం నిర్వహించారు. కార్యక్రమంలో నందానగర్ బస్తీ దవాఖాన వైద్యుడు డానియేల్, బస్తీ ప్రెసిడెంట్ కార్తీక్, అంగన్‌వాడీ టీచర్లు లలిత, జ్ఞానేశ్వరి, ప్రభావతి, రాద, నాగలక్ష్మి, నర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.

చిరువ్యాపారులకు న్యాయం చేయాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి నల్ల చెరువు ఆక్రమణల కూల్చివేతల్లో సర్వం కోల్పోయిన చిరువ్యాపారులకు న్యాయం చేయాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు డిమాండ్ చేశారు. సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నల్ల చెరువులో ఆదివారం హైడ్రా అధికారులు కూల్చివేతలు చేపట్టిన స్థలం పట్టాదారులకు చెందిందన్నారు. అయితే అందులో అద్దెకు ఉంటున్న చిరు వ్యాపారుల సామాగ్రిని కూడా తీసుకునే సమయం ఇవ్వకుండా కూల్చివేతలు చేపట్టడం దురదృష్టకరమన్నారు. సర్వం కోల్పోయి రోడ్డున పడ్డ బాధితులకు నష్టపరిహారం అందించాలని కోరారు. శని, ఆదివారం వచ్చిందంటే నగరవాసుల్లో హైడ్రా దడ మొదలవుతుందన్నారు. హైడ్రా అధికారులు రాత్రికి నోటీలు అందించి ఉదయాన్నే కూల్చివేస్తే అక్కడ ఉంటున్న వారి పరిస్థితి ఏమిటని, వారు ఎక్కడికి వెళ్లాలని ప్రశ్నించారు. కోర్టు ఆదేశాలకు వ్యతిరేకంగా నల్ల చెరువు ఆక్రమణలను కూల్చివేతలు చేపట్టారని, ఇప్పటికైనా హైడ్రా విధి విధానాలను స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ప్రజలను సంక్షేమ పథకాల నుంచి దారి మళ్లించేందుకు హైడ్రా కూల్చివేతలను ప్రభుత్వం చేపట్టిందని దుయ్యబట్టారు. కూల్చివేతల అనంతరం నిర్మాణ వ్యర్థాలను తరలించకుండా అక్కడే ఉంచుతున్నారన్నారు.

మాధవీనగర్‌లో శేరిలింగంపల్లి ఎమ్మెల్యే పర్యటన



మాధవీనగర్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, అధికారులు

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని మాధవీనగర్‌కాలనీలో పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అధికారులతో కలిసి సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాలనీలో అసంపూర్తిగా నిలిచిన రోడ్ల పనులను త్వరగా పరిష్కరిస్తామన్నారు. త్వరలోనే సీసీ రోడ్డు వేయిస్తానని పేర్కొన్నారు. ప్రధాన రహదారిలో గుంత పడిన ప్పుడల్లా డ్రైనేజి పొంగి కాలనీలోకి నీరు చేరుతుందని దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని శాశ్వతంగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అదే విధంగా అంతరాయం లేకుండా నీటి సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఈఈ గోవర్ధన్, డీఈ రమేశ్, ఏఈ శ్రావణి, వర్క్ ఇన్‌స్పెక్టర్లు మహదేవ్, రవి, ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, ప్రసాద్, జిల్లా గణేశ్, కాశీనాథ్ యాదవ్, కాలనీవాసులు పాల్గొన్నారు.

పట్నం మహేందర్ రెడ్డి బర్త్‌డే వేడుకల్లో నాయకులు



ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డితో బండి రమేశ్, శేరి సతీశ్ రెడ్డి తదితరులు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేశ్, మాజీ అధ్యక్షుడు శేరి సతీశ్ రెడ్డి ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డిని సోమవారం కలిశారు. శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేసి, కేక్ కట్ చేయించి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సంజీవరావు, కూకట్‌పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ పుష్పరెడ్డి, జీవీఆర్, మార్కెట్ కమిటీ బోర్డు మెంబర్లు ఫణీంద్ర కుమార్, దేవ సహాయం, రవి, రేష్మ, దిండి అరవింద్ రెడ్డి, అబ్దుల్ బాకీ, మస్తాన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ నాయకులు..

ఓల్డ్ బోయిన్‌పల్లి: ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ కాంగ్రెస్ నాయకులు పట్నం మహేందర్‌రెడ్డిని కలిసి శాలువాలు కప్పి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ నాయకుడు దండుగుల అశోక్, డీజే నాయుడు తదితరులు ఉన్నారు.



మహేందర్‌రెడ్డికి శాలువా కప్పి శుభాకాంక్షలు చెబుతున్న అశోక్

అక్రమ నిర్మాణాల కూల్చివేత

సుభాష్ నగర్: ప్రభుత్వ స్థలాల్లో వెలిసిన అక్రమ నిర్మాణాలను కుత్బుల్లాపూర్ రెవెన్యూ అధికారులు సోమవారం కూల్చివేశారు. గాజులరామారాం డివిజన్ కైసర్ నగర్‌లోని సర్వే నంబర్ 342 ప్రభుత్వ స్థలంలో వెలసిన ఓ గదిని, జగద్గిరిగుట్ట పరిధి భూదేవి హిల్స్ సర్వేనెంబర్ 348 నిర్మించిన ప్రహరీ, బేస్‌మెంట్లను రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గులాం కలీం నేతృత్వంలో తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివారం సెలవు దినాలు కావడంతో కొంతమంది గుడ్డు చప్పుడు కాకుండా ప్రభుత్వ స్థలాల్లో నిర్మాణాలు చేపడుతున్నారని సమాచారం రావడంతో తక్షణమే స్పందించి నిర్మాణాలను కూల్చివేశామని తెలిపారు.



అక్రమ నిర్మాణాన్ని కూల్చివేసిన రెవెన్యూ అధికారులు

నేడు బీఆర్‌ఎస్ సమావేశం

ఆల్విన్‌కాలనీ: బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ భవన్‌లో మంగళవారం ఉదయం 10.30 గంటలకు శేరిలింగంపల్లి పార్టీ ముఖ్య నాయకుల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని ఆయన కోరారు.

జూడో పోటీల్లో బంగారు పతకం



పోటీల్లో బంగారు పతకం సాధించిన మాస్టర్ నిఖిల్



మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ రాధాకృష్ణనగర్‌కు చెందిన మాస్టర్ నిఖిల్ ఇటీవల చెన్నైలో జరిగిన సౌత్ జోన్ రాష్ట్రస్థాయి మార్షల్ ఆర్ట్స్ అండర్ 14 జూడో పోటీల్లో బంగారు పతకం సాధించాడు. 25 కిలోల బరువు జాబితాలో ప్రత్యర్థితో తలపడి విజేతగా నిలిచి అక్టోబర్ 7న జరగనున్న జాతీయస్థాయి మార్షల్ ఆర్ట్స్ పోటీలకు ఎంపికయ్యాడు.

28న సీపీఐ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ జయంతి

జగద్గిరిగుట్ట: ఈ నెల 28న సీపీఐ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి ఉమా మహేశ్ తెలిపారు. జగద్గిరిగుట్టలోని కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడారు. వేడుకలకు ఉద్యమకారులు, మేధావులు విద్యార్థులు, యువజనులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు హరినాథ్, శ్రీనివాస్, సహదేవ్ రెడ్డి, రాములు కౌన్సిల్ సభ్యులు సామేల్, రవి తదితరులు పాల్గొన్నారు.

గంజాయి విక్రేత, కొనుగోలుదారుల అరెస్టు

జీడిమెట్ల: గంజాయి విక్రేతతో పాటు సేవిస్తున్న ఏడుగురిని జీడిమెట్ల పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. జీడిమెట్ల ఇన్‌స్పెక్టర్ మల్లేశ్, ఎస్‌ఐ హరీశ్ తెలిపిన వివరాల ప్రకారం.. సుభాష్‌నగర్ డివిజన్‌లోని రాంరెడ్డినగర్‌లో మహమ్మద్ సైఫ్ అలీ (26) గంజాయి అమ్ముతున్నట్లు పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. వెంటనే జీడిమెట్ల ఎస్‌ఐ ఆంజనేయులు పెట్రోలింగ్ సిబ్బందితో కలిసి సైఫ్ అలీ ఇంటికి చేరుకుని తలుపులు తెరిచారు. ఇంట్లో రోడామేస్త్రీనగర్‌కు చెందిన ఏడుగురు యువకులు షేక్ హిదాయత్ (24), షేక్ ఇమ్రాన్ (32), మహమ్మద్ అజాం (34), అవుల దినేశ్‌రెడ్డి(23), రాహుల్ సింగ్ (23), మహమ్మద్ మజీద్ (28), మహమ్మద్ ఆరీఫ్ (28) గంజాయి సేవిస్తూ పోలీసుల కంట పడ్డారు. వెంటనే వారిని కిట్స్‌తో టెస్ట్ పరీక్షించగా పాజిటివ్ వచ్చింది. పోలీసులు సైఫ్ అలీ నుంచి ప్యాకెట్లలో ఉన్న 850 గ్రాముల గంజాయి, ఏడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. కాగా విచారణలో సైఫ్ అలీ ఒక్కో ప్యాకెట్ (8గ్రాములు) రూ.200 అమ్ముతున్నట్లు ఒప్పుకున్నాడు. ఎవరైనా గంజాయి అమ్మినా, తాగినట్లు అనుమానం ఉంటే సమాచారం అందించాలని ఇన్‌స్పెక్టర్ హరీశ్ కోరారు.

ఆల్విన్‌కాలనీ డివిజన్‌లో బీజేపీ సభ్యత్వ నమోదు



కార్యక్రమంలో పాల్గొన్న రవికుమార్ యాదవ్ తదితరులు

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ తులసీనగర్, ధరణినగర్, ఆల్విన్‌కాలనీ ఫేజ్ 2, బూత్‌స్థాయిలో కంటెస్టెడ్ కార్పొరేటర్ సురభీర వీందర్‌రావు, డివిజన్ అధ్యక్షుడు కమలాకర్ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ఇంటింటికీ వెళ్లి బీజేపీ సభ్యత్వ నమోదు చేపట్టారు. శేరిలింగంపల్లి అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి రవికుమార్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి డివిజన్‌లో 2 లక్షల మందిని, ప్రతి బూత్ నుంచి 300 మందికి పైగా సభ్యులను నమోదు చేయించాలని సూచించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు రామరాజు, నరసింహాచారి, కుమార్ యాదవ్, రామ్‌రెడ్డి, శ్రీనివాసులు, రవీందర్ రెడ్డి, చారి, శ్రీకాంత్, లక్ష్మీనారాయణ, నరసింహారెడ్డి, రాయల్, రఘు, రమేశ్, శివ, రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణికి 26 వినతిపత్రాలు



అధికారులకు వినతిపత్రాలు అందజేస్తున్న ప్రజలు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి జోనల్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. టౌన్ ప్లానింగ్ 20, ఇంజినీరింగ్ 2, ఎంటమాలజి 1, శానిటేషన్ 1, ఎలక్ట్రికల్ 1, ఇతర సమస్యలు 1 మొత్తం 26 అర్జీలు వచ్చాయని, సత్వర పరిష్కారానికి కృషి చేస్తామని అధికారులు తెలిపారు.

ఓజివా ప్రొడక్ట్ పేరుతో ఆన్‌లైన్‌లో మోసం

రూ.17 వేలు పోగొట్టుకున్న యువతి

వెంగళరావునగర్: ఓజివా ప్రొడక్ట్ పేరుతో యువతి వద్ద నుంచి ఆన్‌లైన్‌లో నగదు కాజేసిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన గీతాంజన సర్కార్ అనే యువతి నగరంలో ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ స్థానిక మధురానగర్‌కాలనీలోని హాస్టల్‌లో ఉంటుంది. ఈనెల 14వ తేదీన ఓజివా అనే ప్రొడక్ట్ సంస్థ నుంచి ప్రమోషన్ కాల్ వచ్చింది. ప్రొడక్ట్ అమ్మకం ద్వారా నగదు వస్తాయని తెలిపారు. ముందుగా రూ.5,197 పంపాలన్నారు. ఆమె గూగుల్ పే ద్వారా పంపింది. జీఎస్టీ కోసమని మరోసారి రూ. 11,999 పంపాలని కోరారు. వాటిని కూడా ప ంపింది. త్వరలోనే రూ.56,002 పంపుతామని చెప్పారు. అయితే ఆ నగదు మాత్రం రీఫండ్ కాలేదు. దీంతో తాను మోసపోయానని గ్రహించి సైబర్ పోలీసులకు తెలియజేసి అనంతరం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్‌ఎస్‌సీటీయూలో స్పాట్ అడ్మిషన్లు

అక్టోబర్ 3న నిర్వహించేందుకు ఏర్పాట్లు

రాయదుర్గం: ములుగులోని సమ్మక్కసారక్క సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీలో స్పాట్ అడ్మిషన్ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ మెంటర్ యూనివర్సిటీగా వ్యవహరిస్తున్నందున హెచ్‌సీయూ అధికారులు ఒక ప్రకటనను సోమవారం విడుదల చేశారు.2024–25 విద్యాసంవత్సరం బీఏ (హానర్స్) ఇంగ్లిష్‌లో జనరల్ సీట్లు 9, ఎస్సీ–4, ఎస్టీ–2, ఓబీసీ 7, ఈడబ్ల్యూఎస్–2, మొత్తం 24 సీట్లు, బీఏ (హానర్స్) ఎకనామిక్స్‌లో జనరల్ సీట్లు 8, ఎస్సీ 4, ఎస్టీ 2, ఓబీసీ 7, ఈడబ్ల్యూఎస్–2, మొత్తం 23 సీట్లు ఖాళీగా ఉన్నాయి. స్పాట్ అడ్మిషన్లను ఎస్‌ఎస్‌సీటీయూలోని యూత్ ట్రైనింగ్ సెంటర్ భవనంలో అక్టోబర్ 3వ తేదీన ఉదయం 9.30 గంటలకు నిర్వహిస్తారు. స్పాట్ అడ్మిషన్లకు హాజరయ్యే విద్యార్థులు పదో తరగతి, ఇంటర్ సర్టిఫికెట్లు, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు,టీ సీ, మైగ్రేషన్ సర్టిఫికెట్, మెడికల్ డిక్లరేషన్ అఫిడవిట్, ఎస్సీ/ఎస్టీ/ఓబీసీ/ ఎన్‌సీఎల్/ఈడబ్ల్యూఎస్/పీడబ్ల్యూడీ/డీపీ సర్టిఫికెట్లు, దరఖాస్తుదారులు ఆన్‌లైన్ దరఖాస్తును సమర్థ్ పోర్టల్‌లో పూర్తి చేయాలి. అర్హులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని హెచ్‌సీయూ అధికారులు కోరారు.

లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలి

నిజాంపేట్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా నాయకుడు చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 23ను బ్లాక్ డేగా పాటించాలని కేంద్ర రాష్ట్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు సోమవారం నిజాంపేట్ వార్డు కార్యాలయంలో సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నల్ల చట్టాలను తీసుకువచ్చిందని, వీటితో కార్మికులు కార్పొరేట్ సంస్థలకు బానిసలుగా మారే ప్రమాదం పొంచి ఉందన్నారు. వారి కనీస వేతనం రూ.26 అమలు చేయాలని, కాంట్రాక్ట్ కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కార్మికులకు హయ్యర్ పెన్షన్ చెల్లించాలని డిమాండ్ చేశారు. కొత్త పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. ఈపీఎఫ్ పెన్షన్ దారులకు కనీస పెన్షన్ రూ. 9 వేలు తగ్గకుండా చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ప్రవీణ్, యాదన్న, ప్రశాంత్, జితేందర్, శ్రీను, నరసింహ, బాలయ్య, దీపక్, పెంటమ్మ, లక్ష్మి, వెంకట్, కిషన్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలి

ఏఐఎఫ్‌డీవై గ్రేటర్ హైదరాబాద్ కన్వీనర్ మధుసూదన్



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న గ్రేటర్ హైదరాబాద్ కన్వీనర్ డి. మధుసూదన్

మియాపూర్: ఈ నెల 28న వరంగల్‌లో జరగనున్న ఏఐఎఫ్‌డివై రాష్ట్రస్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలని ఏఐఎఫ్‌డివై గ్రేటర్ హైదరాబాద్ కన్వీనర్ డి. మధుసూదన్ అన్నారు. స్టాలిన్‌నగర్‌లో రాష్ట్రస్థాయి సమావేశానికి సంబంధించిన కరపత్రాన్ని సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ...వరంగల్‌లో రాష్ట్రస్థాయి సమావేశంలో రాష్ట్రంలో పాలకవర్గాలు అనుసరిస్తున్న యువజన వ్యతిరేక విధానాలపై భవిష్యత్ కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి భారీగా హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యువతుల విభాగం గ్రేటర్ హైదరాబాద్ కమిటీ కన్వీనర్ ఎండి. సుల్తానాబేగం, కన్వీనర్, కమిటీ సభ్యులు డి.కీర్తి, దశరథ్ నాయక్, శ్రీనివాసులు, కె.షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.